# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి ఆఆ సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 20ఆ8 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మిత్రులు** రేవూరి అనంత పద్మనాభరావుగారు ఆలిండియా రేడియోలో డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా రిటైరయిపోయాక తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక అధికారిగా చేరారు. నేను లోగడ చేసిన 'ప్రజావేదిక' ధోరణిలో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌లో విద్యార్ధులతో వారికి సంబంధించిన అంశాలపై చర్చావేదికను ("యువతరంగం") నిర్వహింపజేయాలని నన్ను పిలిపించారు. అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, మరో మిత్రులు కె.వి.రమణాచారిగారు. వారిని కలిశాం. ఆయన వరంగల్లులో లెక్చెరర్‌గా పనిచేసే రోజుల్లో నా నాటిక "దొంగగారొస్తున్నారు, స్వాగతం చెప్పండి"లో ప్రధానపాత్రని పోషించారు. వారితో చర్చముగిశాక పద్మావతి గెస్టు హౌస్‌కి భోజనానికి వచ్చాం. అక్కడ మరో సలహామండలి సమావేశాన్ని ముగించుకుని భోజనానికి ఉపక్రమించే ప్రయత్నంలో ఉన్నారు చాలామంది ప్రముఖులు సి.నారాయణ రెడ్డి, శలాక రఘునాధ శర్మ, కందాడై నరసింహా చార్యులు, మైలవరపు శ్రీనివాసరావు, మేడసాని మోహన్, శివారెడ్డి ప్రభుతులు. మాటల్లో నా 'ఎలిజీ'ల ప్రసక్తి వచ్చింది. వాటిని సినారె 'ఎలజీలు' అనలేదు.

"స్మృతి శకలాలు" అన్నారు సినారె.

కందాడై కల్పించుకుని "ముందు 'లా' చేర్చినా బాగుంటుంది" అన్నారు.

స్మృతి శలాకలు.

మరో సందర్భంలో నాకో కొత్త పేరు పెట్టారు సి.నారాయణ రెడ్డిగారు. ఉన్నపాటున కొత్తమాటని సృష్టించడం ఆయనకి అలవాటు. నేను హైదరాబాదు విమానశ్రయంలో విమానం ఎక్కడానికి ఎదురుచూస్తున్నాను. సినారె విమానం దిగారు. నన్ను చూస్తూనే దగ్గరికి వచ్చి, నా బుగ్గలు పట్టుకుని "శిశుముఖుడు" అన్నారు.

"మెడ దగ్గరయితే మీ వయస్సు తెలుస్తుంది. కాని ముఖం మాత్రం 'శిశుముఖుడు'."

మా శ్రీనివాస్ మెమోరియల్ ఫౌండేషన్‌కి ప్రసంగానికి (స్మారక ఉపన్యాసం) రావాలని గుర్తుచేశాను. “The Lyrical Excellance in Telugu Film” అన్న విషయం మీద మాట్లాడడానికి అంగీకరించారు. అయితే అనారోగ్యం కారణంగా ఆ ప్రసంగం జరగలేదు.

కొన్ని రచనలు నిత్యనూతనంగా అలరిస్తూనే ఉంటాయి. నా ‘కళ్ళు‘ నాటిక, నా ‘తాజ్‌మహల్‘ కథానిక, నా సాయంకాలమైంది‘ నవల, నా ‘సంసారం చదరంగం‘ సినిమా ఇలాగ. వీటి జ్ఞాపకాలు జీవితానికి ఆక్సిజన్. ఇప్పటికీ ‘కినెగె. కాం‘ ఇంటర్నెట్ విక్రయ సంస్థ అతి తరుచుగా  ఈవారం పాపులర్ పుస్తకం ‘సాయంకాలమైంది‘ అంటూంటారు. ఆ పాపులారిటీని జయించాలని చాలా పరిశోధన జరిపి ఈ మధ్య ‘రుణం‘ నవల రాశాను. మిత్రుడు, రచయిత దివాకర్ బాబు ‘ఇది రైటర్స్ నవల‘ అన్నాడు. ‘సాయంకాలమైంది‘ నవల మీద నాకు కించిత్తు ఈర్ష్య ఉంది.

ఏమయినా కొన్ని స్పందనలు విన్నప్పుడు ప్రాణం లేచి వస్తుంది. *అలా వడబోసిన కొన్ని స్పందనలు:*

2007 మార్చి 19. రాత్రి చాలా ఆవేశంగా ఫోన్ చేశారు రచయిత, కవి భువనచంద్ర సాయంకాలమైంది నవల ఇంకా చదువుతూ. ”నేను చెప్పలేకపోతున్నాను. మనస్సుకి భాష ఏదయినా ఉంటే దానితో చెప్పగలను. నేను మిలటరీవాడిని. కన్నీళ్ళు మరిచిపోయాననుకున్నాను. అలాంటిది ఏడ్చాను. పుస్తకం పూర్తిచేసి చేద్దామనుకున్నాను. కానీ వరదమ్మ మృతి తర్వాత ఆగలేకపోయాను. నా తలమీద పెట్టి నమస్కరిస్తున్నాను. లైన్ బై లైన్ చదువుతున్నాను. భగవంతుడు మీకు వెయ్యేళ్ళు ఆయుష్షు ఇవ్వాలి. మరెన్నో మీరు రాయాలి. నవల పూర్తయ్యాక మళ్ళీ ఫోన్ చేస్తాను.”

ఇలా ఎందరి మిత్రుల శుభాకాంక్షల వరమో నా ఆయుష్షు.

నవల చదవడం పూర్తిచేసి రాత్రి పదకొండుగంటలకి మళ్ళీ ఫోన్ చేశారు. ”ఈ నవల 500 శంకరాభరణాలతో సమానం” అన్నమాట ఆయన ఆనందపూర్ణమయిన ఆవేశం మధ్య వెలువడినది.

ఆనందం కొలమానానికి తూకపురాళ్ళు లేవు. ఈ తరానికి గొప్ప కళాఖండం ‘శంకరాభరణం‘. ఒక విశ్వనాథ, ఒక ‘శంకరరాభరణం‘ గుర్తుకురావడం ఆ నవల చేసుకున్న పుణ్యం.

కొంచెం దూరమయినా మరొక స్పందన చెప్పాలి. ‘కంచె‘ సినిమా షూటింగు మొదటి రోజే నేను మొదటిసారిగా దర్శకుడు క్రిష్‌ని కలిశాను. మరుసటి షెడ్యూలులోననుకుంటాను. ఆయనకి ‘సాయంకాలమైంది‘ నవల యిచ్చి మరిచిపోయాను. తర్వాతి షెడ్యూలుకి వచ్చి కారవాన్‌లో మేకప్ చేసుకుంటున్నాను. క్రిష్ కారవాన్ తలుపు తీసుకువచ్చి నా చుట్టూ ఉన్న కుర్చీలను దూరంగా జరిపి నా కాళ్ళమీద సాష్టాంగం పడిపోయాడు. ”అయ్యా మీరు నవల ఇచ్చాక మూడుసార్లు చదివాను. మీతో మాట్లాడాలని ప్రయత్నించాను. నాకు మాటల్లేవు. సినిమా వాడిని కనుక ఈ నవలని సినిమా చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చింది. కానీ ఇందులో అన్నిపాత్రలు - సుభద్రాచార్యులు, తిరుమలాచార్యులు, వెంకటపతి, ఆఖరికి సాతాని వేషమూ మీరే చెయ్యాలి. మీ ‘సైకి‘లోంచి వచ్చిన పాత్రలవి. ఇకముందు మీ చేత ఏం చేయించినా - నాకెలా చేయించాలో తెలుసు” అన్నారు. తమాషా ఏమిటంటే - అటు తర్వాత నేను క్రిష్ సినిమాలో నటించలేదు.

మరొక గొప్ప స్పందన నన్ను బాగా కదిలించింది. లక్ష్మీకాంత శర్మ అనే ఒక ఐటీ టెక్నోక్రాట్ ఫోన్ చేశారు తన్మయత్వంతో. ఆయన పరిచితుడు. నా ‘సాయంకాలమైంది‘ నవలని తిరుపతి వెళ్ళి కొనితెచ్చుకున్నాడట. వరంగల్లు దగ్గర కాళేశ్వరం అనే గ్రామంలో అతని తండ్రి అర్చకుడు. నవల చదివాక తల్లిదండ్రులతో ఉండాలని విదేశాలలో ఉద్యోగాలు వచ్చినా వదులుకుని ఇండియాలో ఉండిపోయాడు ”మిమ్మల్ని వచ్చి కలుస్తాను సార్” అన్నాడు.

పొట్టి శ్రీరాములు హాలులో 53వ ఆంధ్రప్రదేశ్ అవతరణ సభ. పోలీసు కమీషనర్ ఆర్. శేఖర్ ముఖ్య అతిధి. నేను ప్రత్యేక అతిధిని.

మాలతీ చందూర్ సభ మొదలుపెట్టే ముందు నావేపు వొంగి "మీరు సోబర్ అయిపోయింది ఎప్పట్నుంచీ?" అన్నారు.

సమాధానానికి తడుముకోలేదు. "వాసూ పోయినప్పట్నుంచీ" అన్నాను. అర్ధమయినట్టు తలూపారు.

తర్వాత కవిసమ్మేళనంలో నేను అమెరికా వెళ్ళినప్పుడు ఒకానొక విమాన ప్రయాణంలో రాసిన 'అమెరికా పాటలు' చదివాను. ఆడియన్స్ ఉర్రూతలూగిపోయారు. మాలతీచందూర్ లేచివచ్చి నా చేతిలో కవిత లాక్కుని ఎన్.ఆర్ చందూర్‌కి ఇచ్చారు - 'జగతి'లో వేస్తారని.

'జగతి' చరిత్రలో ఎడిటర్‌గారి ప్రమేయం లేకుండా ఆమె ఎంపికచేసిన రచన అదొక్కటేనేమో.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments